సాక్షి కాకినాడ

బుధవారం | 30 | జూలై | 2025



‘మాచవరం’ ఘటనపై కదిలిన యంత్రాంగం

బాలికపై కరస్పాండెంట్ అకృత్యానికి పాల్పడిన మాచవరం మార్గదర్శి పాఠశాల ఘటనపై కోనసీమ డీఈఓ విచారణ చేపట్టారు.



ఫుల్ వసూల్

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు సంక్షేమ పథకాలను అందించనప్పటికీ, మద్యాన్ని మాత్రం ‘ఫుల్’గా అందుబాటులోకి తీసుకువచ్చింది.

8లో

మిగులు జలాల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి మంగళవారం 6,01,844 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. తూర్పు డెల్టాకు 4,300, మధ్య డెల్టాకు 2,600, పశ్చిమ డెల్టాకు 6 వేల క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులుగా

గురువులపై బరువులు

- బోధనేతర పనులతో సతమతం
- యాప్‌లు, ఆన్‌లైన్ నమోదులతో ఇక్కట్లు
- తాజాగా పీ–4పై ఆదేశాలు
- బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలంటూ ఒత్తిళ్లు
- మండిపడుతున్న ఉపాధ్యాయులు



ముమ్మిడివరంలో ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల ధర్నా (ఫైల్)

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): చదువులు చెప్పే గురువులపై కూటమి ప్రభుత్వం బోధనేతర పనుల బరువులు మోపుతోంది. నానాటికీ ఈ భారం పెరుగుతోందే తప్ప ఏమాత్రం తగ్గడం లేదు. దీనిపై ఉపాధ్యాయులు మండిపడుతున్నారు. ప్రతి రోజూ వాట్సాప్‌లో అర్జెంట్.. మోస్ట్ అర్జెంట్.. అంటూ మెసేజ్‌లు, ఆన్‌లైన్ పనులపై ఆదేశాలు ఇస్తూండటంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో మొత్తం 1,285 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. వీటిలో దాదాపు 5,100 మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. వేసవి సెలవుల అనంతరం జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. ఆ తర్వాత స్కూల్ ఆర్గనైజేషనల్ టీములు (ఎస్‌ఓటీ), ఎంటీఎస్, బదిలీల కౌన్సెలింగ్ నిర్వహణతో 15 రోజులు గడచిపోయాయి. అనంతరం, గిన్నిస్ రికార్డు పేరిట జూన్ 21న చేపట్టిన యోగాంధ్ర కోసం పాఠశాలల్లో ముందస్తు కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో ఉపాధ్యాయులను, విద్యార్థులను భాగస్వాముల్ని చేశారు. ఈ నెల 10న నిర్వహించిన మెగా పేరెంట్స్ – టీచర్స్ మీట్(పీటీఎం)కు పది రోజులు ముందుగానే సన్నాహక కార్యక్రమాలు నిర్వహించారు. ఇవి ముగించుకుని హమ్మయ్యా.. అనుకునేసరికి ఈ నెల 14 నుంచి స్కూల్ లీడర్‌షిప్, ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యాశాస్త్రం (ఎఫ్ఎల్ఎన్) వంటి శిక్షణ కార్యక్రమాలు ప్రారంభించారు. ఇటువంటి వాటితో తమ సమయం వృథా అవుతోందని, అనివార్యంగా బోధనకు దూరమవ్వాల్సి వస్తోందని టీచర్లు అంటున్నారు.

యాప్‌లతో ఉక్కిరిబిక్కిరి

- పాఠశాల విద్యా శాఖలో ఉన్న అన్ని యాప్‌లను ఒకే వేదికపై తీసుకువచ్చి లెర్నింగ్ ఎక్స్‌లెన్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్ (లీప్) యాప్ రూపొందించారు. దానిలోనే ఐఎంఎంఎస్, స్టూడెంట్ కిట్స్, మెగా పీటీఎం వంటివన్నీ ఉంచారు.
- సర్వర్ సక్రమంగా లేకపోవడంతో ఆన్‌లైన్‌లో టీచర్ ఫొటో హాజరు నమోదు ఉదయం, సాయంత్రం వేళల్లో ఆలస్యమవుతోంది.
- మధ్యాహ్న భోజన పథకానికి సన్నబియ్యం అందిస్తున్నారు. ప్రతి నెలా పాఠశాలకు అందిన అన్ని బియ్యం బస్తాలపై క్యూఆర్ కోడ్‌లను ఉపాధ్యాయులు స్కాన్ చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. వంటకు ముందు ఆ బస్తా తెరచిన ప్రతిసారీ క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి, బియ్యం నాణ్యతను పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి.
- బియ్యం, సరకులు, యూనిఫాం, పాఠ్య పుస్తకాల వంటివి డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి తెచ్చుకోవడం తదితర పనులను ఉపాధ్యాయులే చేయాల్సి వస్తోంది.
- వివిధ పనులకు సంబంధించి ఉన్నత పాఠశాలల్లోని ఉపాధ్యాయులు 500 నుంచి వెయ్యి వరకూ ఫొటోలు అప్‌లోడ్ చేయాల్సి వస్తోంది. ఇంటర్‌నెట్, సర్వర్ సమస్యతో ఇవి ఏ సమయానికి అప్‌లోడ్ అవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. దీని వలన టీచర్ల సమయం వృథా అవుతోంది.
- ఇవి చాలవన్నట్టు ఈ నెల 28 నుంచి లీడర్‌షిప్ ట్రైనింగ్ రెండో విడత నిర్వహిస్తున్నారు. మండల స్థాయిలో హెచ్‌ఎంలు, ఎంఈఓలు గంటల తరబడి ఈ సమావేశాల్లో పాల్గొనాల్సి వస్తోంది.
- ఆగస్టు 4 నుంచి ఎఫ్ఎ–1 పరీక్షలున్నందున సిలబస్ పూర్తి చేయాల్సి ఉందని, ఈ సమయంలో తమపై ఇన్ని బోధనేతర పనులు మోపడమేమిటని ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పొజిషన్ ఐడీలు రాక..

బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ముగియడంతో జిల్లావ్యాప్తంగా దాదాపు 1,400 మంది ఉపాధ్యాయులు ఆయా ప్రాంతాలకు వెళ్లారు. గతంలో రెగ్యులర్‌గా జీతాలు తీసుకుంటున్నప్పటికీ బదిలీ అనంతరం మరో స్థానానికి వెళ్లడంతో వారికి ప్రభుత్వం పొజిషన్ ఐడీ కేటాయించాలి. ఇది జరిగితేనే సీఎఫ్ఎంఎస్‌లో వారి వివరాలు కనిపిస్తాయి. కానీ, ప్రభుత్వం ఇప్పటి వరకూ పొజిషన్ ఐడీలు కేటాయించకపోవడంతో వారికి జీతభత్యాలు నిలిచిపోయాయి. బదిలీ అయిన ప్రాంతాల్లో జీతాలు తీసుకునేలా అక్కడి డీడీఓకు సమాచారం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోలేదు. అలానే మున్సిపల్ ఉపాధ్యాయులు మార్కాపురం తదితర ప్రాంతాలకు బదిలీ అయ్యారు. ట్రెజరీ మారడంతో వారికి కూడా పొజిషన్ ఐడీలు కేటాయించాల్సి ఉంది. అలాగే, మోడల్ ప్రైమరీ స్కూల్, అప్‌గ్రేడ్ చేసిన ఉన్నత పాఠశాలల్లో ఇద్దరు ఉపాధ్యాయులున్న చోట అదనంగా మరో మూడు పోస్టులు ఇచ్చారే గానీ.. పొజిషన్ ఐడీలు కేటాయించలేదు. అలా జరగకపోవడంతో జీతాలు రాక వారందరూ సతమతమవుతున్నారు. బదిలీ అయిన వారికి జూన్ నెల జీతాలు ఇప్పటి వరకూ రాలేదు. ఈ నెలలో కూడా ఐడీలు రాకపోతే ఆగస్టులో కూడా జీతాలు అందుకోలేని పరిస్థితి. బదిలీపై వెళ్లిన ప్రాంతంలో ఇంటి అద్దెలు, రవాణా, అడ్వాన్సుల రూపంలో ఉపాధ్యాయులకు ఖర్చు మరింత పెరిగింది. ఈ పరిస్థితుల్లో జీతాలు నిలిచిపోవడంతో వారు సతమతమవుతున్నారు.

పీ–4పై ఒత్తిళ్లు

మరోవైపు ప్రభుత్వం పీ–4 (పబ్లిక్, ప్రైవేట్, పీపుల్స్, పార్టనర్‌షిప్) పేరిట ఉపాధ్యాయులనూ ఒత్తిడికి గురి చేస్తోంది. ప్రధానోపాధ్యాయులు 5, ఉపాధ్యాయులు 2 చొప్పున పేద కుటుంబాలను తప్పనిసరిగా దత్తత తీసుకోవాలంటూ ఆంక్షలు పెడుతోంది. రెండు రోజుల్లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తి చేయాలని ఉపాధ్యాయులపై ఒత్తిడి తెస్తోంది. దీనిని ఉపాధ్యాయులు తప్పు పడుతున్నారు. ఇప్పటికే బోధనేతర పనులతో సతమతమవుతూంటే కొత్తగా పీ–4 పేరిట పేదరిక నిర్మూలనతో తమనెందుకు కలుపుతున్నారని మండిపడుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పెట్టిన ఈ కార్యక్రమానికి సంపన్నులు, కార్పొరేట్ సంస్థలు ముందుకు రాకపోవడంతో ప్రభుత్వోద్యోగులపై రుద్దడానికి ప్రయత్నిస్తున్నారని దుయ్యబడుతున్నారు. ఉపాధ్యాయుల ఆగ్రహం నేపథ్యంలో పీ–4 రుద్దడంపై ప్రభుత్వం ప్రస్తుతానికి వెనక్కి తగ్గినట్టు చెబుతున్నారు.

జీతాలు వెంటనే చెల్లించాలి



బదిలీ అయిన ఉపాధ్యాయులకు వెంటనే జీతాలు చెల్లించాలి. ప్రస్తుతం మోడల్ ప్రైమరీ పాఠశాలలో అదనపు ఉపాధ్యాయ పోస్టులు కేటాయించారు. పదోన్నతిపై వచ్చిన వారికీ ఇవే ఇబ్బందులు. ఈఎంఐలు కట్టలేక కష్టాలు పడుతున్నారు. యాప్‌లు తగ్గిస్తామని చెప్పినా అన్ని అప్లికేషన్లూ ఒకే యాప్‌లోకి తీసుకొచ్చి నానా యాతనా పెడుతున్నారు.

– చింతాడ ప్రదీప్‌కుమార్, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు

ఒత్తిడి తగ్గించాలి



ఉపాధ్యాయులకు బోధనేతర పనులు తప్పించాలి. నిత్యం ఏదో ఒక పని చెప్పడంతో తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. యాప్‌ల భారం ఎక్కువైంది. వెరీ అర్జెంట్... మోస్ట్ అర్జెంట్ అంటూ మెసేజ్‌ల వల్ల సమయం వృథా అవుతోంది. పీ–4 కార్యక్రమంలో ఉపాధ్యాయులకు ఆప్షన్ ఇవ్వాలే తప్ప తప్పనిసరి చేయకూడదు.

– మెర్ల శ్రీనివాస్ ఎస్‌టీయూ కాకినాడ జిల్లా అధ్యక్షులు

న్యూస్‌రీల్

ఏలేరుకు గోదావరి జలాలు



ఏలేరు రిజర్వాయర్‌లోకి విడుదలవుతున్న గోదావరి జలాలు

ఏలేశ్వరం: తూర్పు గోదావరి జిల్లా సీతానగరం మండలం పురుషోత్తపట్నం నుంచి పైపులైన్ల ద్వారా గోదావరి జలాలను ఏలేరు జలాశయంలోకి విడుదల చేస్తున్నారు. మంగళవారం నాటికి 175 క్యూసెక్కుల గోదావరి జలాలు వదిలారు. అలాగే, ఏలేరు పరీవాహక ప్రాంతం నుంచి 1,910 క్యూసెక్కుల జలాలు రిజర్వాయర్‌లోకి వచ్చి చేరాయి. రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటిమట్టం 86.56 మీటర్లు కాగా మంగళవారం 77.25 మీటర్లుగా నమోదైంది. పూర్తి సామర్థ్యం 24.11 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 10.46 టీఎంసీల మేర నీటి నిల్వలున్నాయి. రిజర్వాయర్ నుంచి ఆయకట్టుకు 1,300, విశాఖ నగరానికి 200 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు.

నేడు సత్యదేవుని హుండీల లెక్కింపు

అన్నవరం: సత్యదేవుని సన్నిధిలో హుండీలను బుధవారం తెరచి భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించనున్నారు. ఉదయం 8 గంటల నుంచి స్వామివారి నిత్య కల్యాణ మండపంలో ఈ కార్యక్రమం జరుగుతుంది. దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ వీర్ల సుబ్బారావు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తారు. సిబ్బంది అందరూ ఈ కార్యక్రమానికి హాజరు కావాలని ఈఓ ఆదేశించారు. గత ఆషాఢ మాసంలో శుభ కార్యాలు జరగనప్పటికీ సత్యదేవుని ఆలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు రావడంతో హుండీల్లో కానుకలు దండిగానే పడ్డాయి. స్వామివారి ఆలయం వద్ద ప్రధాన హుండీ నిండిపోవడంతో సీల్ వేశారు. ఈ నెల కూడా సుమారు రూ.కోటి ఆదాయం రాగలదని అంచనా వేస్తున్నారు.

కూటమి ప్రభుత్వంపై సుప్రీంకోర్టులో పిల్ వేస్తాం



మాజీ ఎంపీ హర్షకుమార్

రాజమహేంద్రవరం సిటీ: దొంగ హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చి, ఆ హామీలు అమలు చేయని కూటమి ప్రభుత్వాన్ని రద్దు చేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) వేయనున్నట్లు అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ చెప్పారు. రాజమహేంద్రవరంలోని తన నివాసంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన తరువాత కూటమి ప్రభుత్వం ఒక్క పథకం కూడా అమలు చేయలేదన్నారు. మహిళలకు నెలకు రూ.1,500 ఇస్తే రాష్ట్రం దివాళా తీస్తుందని మంత్రి అచ్చెన్నాయుడు అనడం దారుణమన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ ఆ పథకాన్ని అమలు చేసి చూపారన్నారు. నిరుద్యోగ భృతి ఇస్తామని అమలు చేయకుండా క్యాబినెట్‌లో ప్రకటించడం దారుణమన్నారు. తల్లికి వందనం అమలు జరగడం లేదన్నారు. జగన్ రూ.13 వేలు ఇస్తే విమర్శించారని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కూడా రూ.13 వేలే ఇస్తోందని చెప్పారు. సంపద సృష్టిస్తామని చెప్పి, కార్పొరేట్ కంపెనీలకు భూములను కారు చౌకగా 99 పైసలకే కట్టబెడుతున్నారని, ఇందులో క్విడ్ ప్రో కో జరుగుతోందని హర్షకుమార్ ఆరోపించారు. ఎవరికో ఒకరికి భూములు కట్టబెట్టడానికే మంత్రి మండలి సమావేశం జరుగుతోందని ధ్వజమెత్తారు. వైఎస్సార్ సీపీ నాయకులపై కూటమి ప్రభుత్వం కక్షపూరిత ధోరణి అవలంబిస్తోందని మండిపడ్డారు. ప్రతి వారినీ జైలులో పెడుతున్నారన్నారు. బిహార్‌లో జరిగిన ఎన్నికల అక్రమాలపై లోక్‌సభలో చర్చ జరపాలని డిమాండ్ చేశారు. బిహార్ ఎన్నికల్లో 8 లక్షల బోగస్ ఓట్లు వచ్చాయన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ అన్ని ఎన్నికల్లోనూ బోగస్ ఓట్లు సృష్టించి గెలుస్తున్నారని ఆరోపించారు. పోలైన ఓట్ల కంటే లెక్క పెట్టిన ఓట్లే ఎక్కువగా ఉంటున్నాయన్నారు.

‘నన్నయ’కు వుడ్ చిప్పర్

రాజానగరం: యూనివర్సిటీ ప్రాంగణాన్ని సుందరీకరించడంలో భాగంగా చెట్ల కొమ్మలు, పొదలు, వ్యర్థాలను చిప్స్‌గా మార్చే మైజో వీమా వుడ్ చిప్పర్ యంత్రాన్ని ఆదికవి నన్నయ యూనివర్సిటీ కొనుగోలు చేసింది. దీనిని వైస్ చాన్సలర్ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ మంగళవారం ప్రారంభించారు. ఈ యంత్ర సాయంతో తయారయ్యే వుడ్ చిప్స్‌ను మొక్కలకు కంపోస్టు ఎరువుగా వాడవచ్చని ఈ సందర్భంగా ఆమె చెప్పారు. వ్యర్థాలను కాల్చివేయడం వలన పర్యావరణం కలుషితమవుతుందని, ఆవిధంగా కాకుండా ఈ యంత్రం చక్కని ప్రత్యామ్నాయమని అన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డీన్ డాక్టర్ బి.జగన్‌మోహన్‌రెడ్డి, కె.దేవలాల్, కె.లక్ష్మీపతి, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

ఈసారైనా ఖరారయ్యేనా!



9 నెలలుగా మూత పడిన మెయిన్ క్యాంటీన్

- 9 నెలలుగా మూతపడి ఉన్న మెయిన్ క్యాంటీన్
- దేవస్థానానికి రూ.30 లక్షల నష్టం
- ఆగస్టు 6న 8వసారి వేలం

అన్నవరం: సాధారణంగా ఒకటోసారి, రెండోసారి, మూడోసారి అని చెప్పి.. తుదిగా వచ్చిన మొత్తానికి వేలం పాట ఖరారు చేస్తారు. ఒకవేళ ఒకటి రెండుసార్లు ఆశించిన మొత్తానికి వేలంపాట వెళ్లకపోతే పాటదారులతో అధికారులు సమావేశమవుతారు. వారి ఇబ్బంది తెలుసుకుని, దాని ప్రకారం కొంత మొత్తం తగ్గించైనా మూడోసారి పాట ఖరారు చేస్తారు. లేకపోతే ఆ మేరకు నష్టం కలుగుతుంది. కానీ, అన్నవరం దేవస్థానంలో మాత్రం అటువంటి పరిస్థితి కనిపించడం లేదు. భక్తులు ఇబ్బంది పడినా, దేవస్థానానికి రూ.లక్షల్లో ఆదాయం నష్టం వచ్చినా పట్టించుకోవడం లేదు.

ఏం జరుగుతోందంటే..

రత్నగిరిపై ఈఓ కార్యాలయం దిగువన దాదాపు 70 సంవత్సరాల నుంచి మెయిన్ క్యాంటీన్ ఉంది. స్వామివారి ఆలయానికి మెట్ల మార్గంలో రాకపోకలు సాగించే భక్తులకు ఇక్కడ టీ, కాఫీ, ఫలహారాలు, భోజనం లభించేవి. దీనికి నెలకు రూ.8 లక్షల వరకూ వేలం పాట జరిగేది. ఏడాదికి రూ.కోటి పైగానే ఆదాయం వచ్చేది. పశ్చిమ రాజగోపురం వెనుక, సత్యగిరిపై సత్రాలు, రెండో ఘాట్ రోడ్డు నిర్మాణాలు జరిగాక భక్తులు అటు నుంచే సత్యదేవుని ఆలయానికి రాకపోకలు సాగిస్తున్నారు. అలాగే, సత్రాల్లో బస చేసేవారి కోసం సీతారామ సత్రం వద్ద సబ్ క్యాంటీన్ ఏర్పాటు చేశారు. దీంతో, మెయిన్ క్యాంటీన్‌లో వ్యాపారం తగ్గింది. ఆ తరువాత సత్యగిరిపై శివసదన్ వద్ద మరో క్యాంటీన్ కూడా ఏర్పాటు చేశారు. రెండు క్యాంటీన్లు అదనంగా రావడంతో మెయిన్ క్యాంటీన్‌కు వ్యాపారం మరింత తగ్గింది. దీనికితోడు ఉదయం 8 నుంచి 10 గంటల వరకూ భక్తులకు దేవస్థానం పులిహోర, దద్ధోజనం పంపిణీ చేస్తూండటంతో ఆ క్యాంటీన్‌లో ఫలహారం తినేవారు కూడా తగ్గారు. దీంతో వ్యాపారం తగ్గింది.

అయితే, అధికారులు వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకోవడం లేదు. గతంలో మాదిరిగానే నెలకు రూ.7 లక్షల నుంచి రూ.8 లక్షల వరకూ ఆదాయం వస్తేనే పాట ఖరారు చేస్తామని చెబుతున్నారు. గత సెప్టెంబర్ నుంచి ఇప్పటి వరకూ ఏడుసార్లు వేలం నిర్వహించారు. అయితే, వ్యాపారం తగ్గిందంటూ పాటదారులు రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకూ మాత్రమే పాడుతున్నారు. గత నెలలో నిర్వహించిన ఆరో విడత వేలంలో రూ.4.20 లక్షలకు మాత్రమే పాట వెళ్లింది. కానీ, ఎక్కువ మొత్తం రాలేదని దీనిని ఖరారు చేయలేదు. ఏడోసారి వేలం నిర్వహిస్తే రూ.2.75 లక్షలకు మాత్రమే పాట వెళ్లింది. దీంతో అదీ ఖరారు చేయలేదు. ఇలా అధికారులు వాయిదా వేస్తూండటంతో గడచిన 9 నెలలుగా దేవస్థానం సుమారు రూ.30 లక్షల వరకూ ఆదాయం కోల్పోయింది. ఈ నేపథ్యంలో ఆగస్టు 6న ఈ క్యాంటీన్‌కు ఎనిమిదోసారి వేలం నిర్వహించనున్నారు. హెచ్చు మొత్తానికి వేలం జరగాలని ఆశిస్తున్నారు. అయితే, నెలకు రూ.4 లక్షలకు మించి వెళ్లే అవకాశం లేదని పాటదారులు చెబుతున్నారు. ఈసారైనా ఖరారు చేస్తారో లేదో వేచి చూడాలి. ఒకవేళ ఈసారి కూడా పాట ఖరారు కాకపోతే దేవస్థానం సొంతంగానే సాయంత్రం వేళ టీ, కాఫీ, ఫలహారాలు విక్రయించాలని భక్తులు కోరుతున్నారు.

భక్తులకు ఇబ్బందులు

మెయిన్ క్యాంటీన్ పక్కనే దాత నిర్మించిన నాలుగంతస్తుల ఉచిత డార్మెట్రీలో ప్రతి రోజూ సుమారు 300 మంది భక్తులు బస చేస్తూంటారు. సేవ చేయడానికి వస్తున్న వారికి కూడా ఇక్కడే వసతి కల్పిస్తున్నారు. పగలు పెద్ద ఇబ్బంది లేకపోయినా రాత్రి వేళల్లో టీ, కాఫీ, ఫలహారాలు లభించక వీరందరూ తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. సబ్ క్యాంటీన్ వద్దకు ఆటోలో వెళ్లి ఫలహారం తిని రావాల్సి వస్తోంది. రానూపోనూ ఆటోకు మనిషికి రూ.50 వసూలు చేస్తున్నారు. దీంతో, టిఫిన్ కోసం భక్తులు రూ.100 నుంచి రూ.150 వరకూ ఖర్చు చేయాల్సి వస్తోంది.

దళిత విద్యార్థులపై కూటమి ప్రభుత్వ కక్ష

- వైఎస్సార్ స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య ఫైర్



హాస్టల్‌లో విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటున్న చైతన్య

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): దళిత విద్యార్థులంటే కూటమి ప్రభుత్వానికి అలుసని వైఎస్సార్ స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య ఆరోపించారు. వారు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగడం సీఎం చంద్రబాబుకు ఇష్టం లేదని విమర్శించారు. వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న సంక్షేమ హాస్టళ్ల బాట కార్యక్రమంలో భాగంగా రాజమహేంద్రవరం ఎస్సీ హాస్టల్‌ను యూనియన్ జిల్లా అధ్యక్షుడు చంద్రబాబు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నీటి ఆనంద్ ఆధ్వర్యాన చైతన్య మంగళవారం సందర్శించారు. సమస్యలు స్వయంగా పరిశీలించి, విద్యార్థుల ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ, వసతి గృహాలను పాడుబెడుతున్నారని, విద్యార్థులకు సరైన తిండి పెట్టకుండా ఆసుపత్రి పాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. జగన్ హయాంలో ఇచ్చిన మంచి భోజనం, మంచి దుస్తులు, పరిసరాల పరిశుభ్రత మాయమైపోయాయని మండిపడ్డారు. పేద విద్యార్థులు బాగా చదువుకుని, మంచి ఉద్యోగాలు పొందాలని, తద్వారా రాష్ట్రంలో పేదరికం కనుమరుగైపోవాలని గత ముఖ్యమంత్రి జగన్ ఆశిస్తే.. ప్రస్తుత సీఎం చంద్రబాబు దానికి పూర్తి విరుద్ధంగా ఆలోచిస్తున్నారని అన్నారు. సమస్యలు పరిష్కరించేంత వరకూ పోరాటం సాగిస్తామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా హాస్టళ్లలో సమస్యలను తక్షణమే పరిష్కరించాలని చైతన్య డిమాండ్ చేశారు. వైఎస్సార్ స్టూడెంట్స్ యూనియన్ రీజినల్ కో ఆర్డినేటర్ రమేష్, విద్యార్థి నేతలు రేష్మ, కేపీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆరో నిందితుడి అరెస్ట్

అమలాపురం టౌన్: దోనిపాటి మహేష్‌పై దాడి చేసినందుకు నమోదైన హత్యాయత్నం, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులో అమలాపురం రూరల్ మండలం ఈదరపల్లికి చెందిన కొత్తపల్లి దుర్గా మహేష్‌ను మంగళవారం అరెస్ట్ చేసినట్లు అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్ తెలిపారు. ఈ కేసులో ఇప్పటికే యల్లమెల్లి విజయ్ రవి శంకర్, ఉరదల బాలరాజు, యర్రా కృష్ణ, మల్లాడి సుదర్శన్, తోట నాగ వెంకట సత్యనారాయణలను అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే.

తేనెటీగల పెంపకంపై శిక్షణ

నల్లజర్ల: వెంకట్రామన్నగూడెంలోని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో ఈ నెల 31న తేనెటీగల పెంపకం – శాస్త్రీయ పద్ధతులపై శిక్షణ ఇస్తున్నట్టు సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ పి.విజయలక్ష్మి తెలిపారు. ఆరోజు ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. తేనెటీగల యాజమాన్యం, తేనె తీసే విధానం, నిల్వ, తేనెటీగల పెంపకంలో సమస్యలు, పురుగులు, తెగుళ్ల యాజమాన్యం తదితర అంశాలపై అవగాహన కల్పిస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని స్త్రీలు, రైతులు, ఈ వ్యాపారం చేయాలనుకునే ఈ శిక్షణకు హాజరుకావచ్చన్నారు. మరిన్ని వివరాలకు 73826 33692, 94905 05926 నంబర్లను సంప్రదించాలన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

తొండంగి: పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడని ఎస్సై జగన్మోహనరావు మంగళవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. తొండంగికి చెందిన కొడవటి ఆనందరావు (50) తాపీమేస్త్రిగా పనిచేస్తున్నాడు. అనారోగ్య కారణంగా మనస్తాపానికి గురై పురుగుమందు తాగాడు. గమనించిన స్థానికులు అతడిని తుని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

యువకుడిని కాపాడిన పోలీసులు

నిడదవోలు: రైల్వేట్రాక్‌పై ఆత్మహత్య చేసుకోబోయిన యువకుడిని నిడదవోలు పోలీసులు కాపాడారు. సోమవారం రాత్రి జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇవీ. సుమారు 25 ఏళ్ల యువకుడు ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం చెందిన ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. దీంతో నిడదవోలు పోలీస్ స్టేషన్ పరిధిలో రైల్వే ట్రాక్‌కు చేరుకున్నాడు. ఆ యువకుడిని గమనించి ఓ వ్యక్తి వెంటనే 112 కాల్ ద్వారా జిల్లా పోలీసులకు సమాచారం అందించాడు. ఎస్పీ డి.నరసింహ కిశోర్ ఆదేశాల మేరకు నిడదవోలు పట్టణ ఎస్సై జగన్‌మోహన్‌రావు, తన సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లారు. ఆ యువకుడి ఆత్మహత్యాయత్నాన్ని అడ్డుకుని పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లారు. అతడి బంధువులకు సమాచారం అందించి, కౌన్సెలింగ్ ఇచ్చారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	23,000 – 23,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	27,500
గటగట (వెయ్యి)	25,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	26,000
గటగట (వెయ్యి)	24,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	19,000 – 20,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	19,000 – 20,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

ఫుల్ వసూల్

- యథేచ్ఛగా మద్యం అమ్మకాలు
- పుట్ట గొడుగుల్లా బెల్ట్ షాపులు
- నిబంధనలు బేఖాతరు
- ఏరులై పారుతున్న మద్యం
- రూ.కోట్లలో అక్రమార్జన

అమలాపురం టౌన్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు సంక్షేమ పథకాలను అందించనప్పటికీ, మద్యాన్ని మాత్రం అందుబాటులోకి తీసుకువచ్చింది. పట్టణాలు, పల్లెలు అనే తేడా లేకుండా అన్నిచోట్ల మద్యం షాపులను ఏర్పాటు చేసింది. దీనికి తోడు విచ్చలవిడిగా పెరిగిన బెల్టుషాపులతో మద్యం ఏరులై ప్రవహిస్తోంది. ఈ షాపుల్లో అమ్మకాల ద్వారా అక్రమార్జన ఎడాపెడా జరుగుతోంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో లైసెన్స్ మద్యం షాపులు 150 లోపు ఉంటే, బెల్ట్ షాపులు దానికి దాదాపు ఏడు రెట్లు పెరిగాయి. లైసెన్స్ దుకాణాల వద్ద పర్మిట్ రూమ్‌ల పేరుతో మద్యం అమ్మకాలు ఫుల్‌గా సాగుతున్నాయి. బెల్ట్ షాపుల ద్వారా అక్రమంగా సరకును అమ్మేస్తున్నారు. లైసెన్స్ మద్యం షాపులకు అనుబంధంగా బెల్ట్ షాపులు ఉండవని, ఒక వేళ బెల్ట్ షాపుల్లో మద్యం పట్టుబడితే, సంబంధిత లైసెన్స్ షాపునకు రూ.5 లక్షలు జరిమానా విధించడంతోపాటు లైసెన్స్ కూడా రద్దు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎక్సైజ్ అధికారులు చేస్తున్న ప్రకటనలు ఆచరణలో అమలు కావడం లేదు.

వెయ్యికి పైగా బెల్ట్ షాపులు

జిల్లాలో అధికారికంగా 146 లైసెన్స్‌డ్ మద్యం షాపులు, 10 బార్లు ఉన్నాయి. ఈ 146 అధికారిక షాపులకు అనుసంధానంగా దాదాపు వెయ్యికి పైగా బెల్ట్ షాపులు అనధికారికంగా నడుస్తున్నాయి. కలెక్టర్ ఇటీవల జిల్లా ఎక్సైజ్ అధికారులతో ఓ సమావేశం నిర్వహించారు. బెల్ట్ షాపులకు ఏ విధమైన ఆస్కారం లేకుండా మద్యం షాపుల ద్వారానే విక్రయాలు జరగాలని ఆదేశించారు. అయితే ఎక్సైజ్ అధికారుల పర్యవేక్షణా వైఫల్యం, లైసెన్స్ మద్యం షాపుల వారితో లాలూచీ వంటి కారణాలతో జిల్లాలో బెల్ట్ షాపులకు కొదవ లేకుండా పోయింది. మామూళ్ల మత్తుతోనే పర్మిట్ రూమ్‌లను, బెల్ట్ షాపులను చూసీ చూడనట్లు వదిలేస్తున్నారన్న ఆరోపణలు బాహటంగా వినిపిస్తున్నాయి.



అయినవిల్లిలో ఓ బెల్ట్ షాపు



అమలాపురం సమీపంలో ఓ మద్యం షాపు వద్ద తాగుతున్న మందుబాబులు

మామూళ్ల మత్తులో!

ఎక్సైజ్ అధికారులను బెల్ట్ షాపుల గురించి అడిగితే ఎక్కడ ఉన్నాయని ఎదురు ప్రశ్నించే స్థాయిలో ఉన్నారు. బెల్ట్ షాపుల నిర్వహణలో ఆరి తేరిన వారంటే, అలాంటి వారిపై లైసెన్స్ షాపుల యాజమానులతో మాట్లాడి పరస్పర అంగీకారం, అవగాహనతో కొందరిపై బైండోవర్ కేసులు నమోదు చేయడం ఎక్సైజ్ అధికారులకు పరిపాటైపోయింది. అయితే పొరుగున్న ఉన్న పాండిచ్చేరి, యానాం నుంచి అక్రమ మద్యాన్ని (నాన్ డ్యూటీ పెయిడ్) తరలిస్తుంటే అధికారులు మాత్రం అలాంటి మద్యాన్ని స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేస్తున్నారు. అయితే కాట్రేనికోన తదితర మండలాల్లో రిమోట్ గ్రామాల్లో కొన్ని మద్యం షాపులు ప్రైవేటు వేలం పాట పరమవుతున్నా పట్టించుకోరు సరికదా, అసలు తమకు తెలియనట్లే వ్యవహరిస్తున్నారు. లైసెన్స్ షాపుల నుంచి సంబంధిత అధికారులకు ప్రతి నెలా అందుతున్న మామూళ్లతో ఇలా జరుగుతోందనే ఆరోపణలు వస్తున్నాయి.

అక్రమంగా అమ్మకాలకు ప్రోత్సాహం

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అవుట్ లెట్ల ద్వారా ప్రభుత్వమే పరిమితంగా మద్యం షాపులను నిర్వహిస్తే, ఈ కూటమి ప్రభుత్వం ప్రజల చేత మద్యాన్ని ఫుల్‌గా తాగించి అమ్మకాలను అయినకాడికి పెంచేసి, తద్వారా వచ్చే ఆదాయానికి ఆశపడి ఈ అడ్డదారులు తొక్కుతోంది. మద్యం విక్రయాలను అటు లైసెన్స్ షాపుల ద్వారా ఇటు బెల్ట్ షాపులు, పర్మిట్ రూమ్‌ల ద్వారా అదనంగా అమ్మేసి అక్రమార్జనకు పాల్పడుతోంది. ప్రజల జీవితాలు, ఆరోగ్యాలతో పని లేదన్నట్లుగా, మద్యం అమ్మకాలే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతూ జిల్లాలో అక్రమ మద్యం అమ్మకాలను ప్రోత్సహిస్తోంది.



అల్లవరం మండలం కొమరగిరిపట్నంలోని నకిలీ మద్యం తయారీతో పట్టుబడ్డ ఏసీ బ్లాక్ పేరుతో లేబుళ్ల బండిల్ (ఫైల్)

మందుబాబులకు పండగే

జిల్లా కేంద్రమైన అమలాపురంలోని ఎక్సైజ్ కార్యాలయం సమీపంలోనే కొన్ని లైసెన్స్ షాపులకు పర్మిట్ రూమ్‌లు ఉన్నాయి. బారులతో సమాంతరంగా మద్యం షాపుల వద్ద కూడా మందుబాబులు ఫుల్‌గా తాగేస్తున్నారు. ఇక గుడి, బడి నిబంధనలను బెల్ట్ షాపుల నిర్వాహకులు అసలు పాటించడం లేదు. బెల్ట్ షాపు పట్టడమే ఓ నేరమైతే గుడి, బడికి 200 మీటర్ల దూరంలో పెట్టడం మరో నేరం. ఉదాహరణకు అమలాపురం రూరల్ మండలం బండార్లంక గ్రామంలో ఇలా బడి, గుడి నిబంధనలకు నీళ్లొదిలి బెల్ట్ షాపులు వెలిశాయి. అమలాపురం రూరల్, అయినవిల్లి, అల్లవరం, ఉప్పలగుప్తం, కాట్రేనికోన మండలాలతో పాటు జిల్లాలో అసలు బెల్ట్ షాపుల లేని గ్రామాలు లేవంటే అతిశయోక్తి కాదు.

నకిలీ మద్యం కేసు

గత టీడీపీ ప్రభుత్వంలో, ఇప్పటి కూటమి ప్రభుత్వంలో బెల్ట్ షాపులతో మద్యం అక్రమ అమ్మకాలు సాగితే, అల్లవరం మండలం కొమరిగిరిపట్నంలో ఏకంగా నకిలీ మద్యం తయారీ కేంద్రం గుట్టురట్టు అవడంతో కోనసీమ ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఏసీ బ్లాక్ పేరుతో నకిలీ మద్యం తయారీ యూనిట్‌ను, ఈ అక్రమ వ్యాపారంలో పాత్రధారులను ఎక్సైజ్ అధికారులు అరెస్ట్ చేశారు. అయితే ఈ కేసులో సూత్రధారులైన పెద్దలను వదిలేసి పాత్రధారులైన చిన్న వారిని మాత్రమే అరెస్ట్ చేశారన్న విమర్శలు, ఆరోపణలు వచ్చాయి. ఈ నకిలీ దందా ఇక్కడ నుంచి సాగుతూ కోనసీమలోని పలు బెల్ట్ షాపులకు నకిలీ మద్యాన్ని సరఫరా చేశారన్న గుసగుసలు కూడా వినిపించాయి. కేవలం కేరామిల్ లిక్విడ్, స్పిరిట్‌తో నకిలీ మద్యాన్ని తయారు చేసి నకిలీ లేబుళ్లతో ఓ బాటిలింగ్ యూనిట్‌నే మెయింటెన్స్ చేస్తున్న ఈ నకిలీ ముఠా స్థావరాన్ని చూసి ప్రజలు అవాక్కయ్యారు. రూ.10 కోట్ల మేర ఈ నకిలీ మద్యం కేంద్రం నుంచి పక్కదారి పట్టిందని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ బాహటంగా స్పష్టం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వంలో బెల్ట్ షాపుల కల్చర్ గత టీడీపీ ప్రభుత్వం కంటే రెట్టింపు అయిందని ఆందోళన వ్యక్తం చేశారు.

చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి అవసరం

- పారిశ్రామిక వేత్త మట్టే శ్రీనివాస్
- 'నవోదయ'లో కబడ్డీ మీట్ ప్రారంభం

పెద్దాపురం: ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని ప్రముఖ పారిశ్రామిక వేత్త, లలిత రైస్ ఇండస్ట్రీస్ అధినేత మట్టే శ్రీనివాస్ అన్నారు. స్థానిక జవహర్ నవోదయ విద్యాలయలో మూడు రోజుల పాటు నిర్వహించే క్లస్టర్ స్థాయి కబడ్డీ మీట్‌ను మంగళవారం ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ప్రిన్సిపాల్ బి.సీతాలక్ష్మి అధ్యక్షతన జరిగిన కబడ్డీ మీట్‌నుద్దేశించి శ్రీనుబాబు మాట్లాడుతూ ఉన్నత విద్యతో పాటు క్రీడారంగానికి ప్రాధాన్యనివ్వడంలో నవోదయ విద్యాలయాల పాత్ర కీలకమన్నారు. అనంతరం క్రీడా జ్యోతిని వెలిగించి కృష్ణా క్లస్టర్, తుంకుర్ క్లస్టర్ అండర్–19 బాలుర లీగ్ మ్యాచ్ కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో పీఈటీ సత్యనారాయణ, అనురాధ, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది, తెలంగాణ, ఏపీ, కర్ణాటక ప్రాంతానికి చెందిన 350 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న పారిశ్రామికవేత్త శ్రీనివాస్

పెళ్లి భయంతో పారిపోయిన బాలికలు

- తల్లుల ఫిర్యాదుపై స్పందించిన ఇంద్రపాలెం పోలీసులు
- గంటల వ్యవధిలోనే ఆచూకీ లభ్యం

కాకినాడ రూరల్: ఇంటిలోని పెద్దలు పెళ్లి సంబంధాలు చూస్తుండడంతో ఆ బాలికలు భయపడిపోయారు. తమకు ఇష్టం లేకపోయినా పెళ్లి చేస్తారనే ఆందోళనతో ఇంటి నుంచి పారిపోయారు. వారి తల్లుల ఫిర్యాదు మేరకు పోలీసులు వెంటనే స్పందించి ఆ బాలికల ఆచూకీ గుర్తించారు. వివరాల్లోకి వెళితే.. కరప మండలం అచ్యుతాపురానికి చెందిన ఇద్దరు బాలికలు వరసకు అక్కాచెల్లెళ్లు (అన్నదమ్ముల పిల్లలు) అవుతారు. వీరిలో ఒకరు ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం, మరొకరు పదో తరగతి చదువుతున్నారు. వీరిద్దరికీ పెద్దలు పెళ్లి సంబంధాలు చూడడం ప్రారంభించారు. తమకు ఇష్టం లేని పెళ్లిళ్లు చేస్తారనే భయం వారికి పట్టుకుంది. పెద్దలను ఎదిరించలేక, ఇంటి నుంచి పారిపోయేందుకు పథకం వేసుకున్నారు. సోమవారం ఉదయం ఇంటి నుంచి కాలేజ్, స్కూల్‌కు అని చెప్పి బయలుదేరారు, మధ్యాహ్నం మూడు గంటలకు కాకినాడ నుంచి తప్పించుకుని పారిపోయారు. రాత్రయినా ఇద్దరు పిల్లలూ ఇంటికి రాకపోవడంతో కంగారు పడిన తల్లిదండ్రులు చుట్టుపక్కల అన్నిచోట్లా వెతికారు. ఫలితం లేకపోవడంతో రాత్రి పది గంటలకు ఇంద్రపాలెం పోలీసులను ఆశ్రయించారు. బాలికల తల్లుల ఫిర్యాదు మేరకు ఎస్సై వీరబాబు కేసు నమోదు చేసి ఉన్నతాధికారులకు సమాచారంతో పాటు తన బృందంతో ఆచూకీ కోసం గాలింపు చేపట్టారు. బాలికలు అమలాపురం వైపు వెళ్లినట్టు టెక్నాలజీ ఆధారంగా గుర్తించి, అక్కడి పోలీసుల సహకారంతో కేవలం మూడు గంటల వ్యవధిలోనే పట్టుకోగలిగారు. బాలికలను మంగళవారం ఉదయం వారి తల్లిదండ్రులకు అప్పగించారు. వారికి పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎస్పీ బిందు మాధవ్, ఏఎస్పీ పాటిల్ దేవరాజ్, రూరల్ సీఐ చైతన్య కృష్ణ, సిబ్బంది, అమలాపురం పోలీసుల సహకారంతో తక్కువ సమయంలో బాలికల ఆచూకీ కనుగొన్నామని ఎస్సై వీరబాబు తెలిపారు.



బాలికలను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న ఇంద్రపాలెం పోలీసులు

ఆర్డినెన్స్‌తో 'జయలక్ష్మి' బాధితులకు న్యాయం చేయాలి

కాకినాడ రూరల్: జయలక్ష్మి ఎంఏఎం కో ఆపరేటివ్ సొసైటీ బాధితులకు సత్వర న్యాయం కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా ఆర్డినెన్స్‌ను తీసుకురావాలని చైర్మన్ గంగిరెడ్డి త్రినాథరావు అన్నారు. సర్పవరం జంక్షన్ వద్ద మెయిన్ బ్రాంచ్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తమ పాలకవర్గం అధికారం చేపట్టి దాదాపు మూడేళ్లు అయ్యిందని, బాధితుల కోసం పోరాటం సాగిస్తూనే, రుణాలు తీసుకుని ఎగ్గొటిన వారికి చెందిన సుమారు రూ.500 కోట్ల ఆస్తులను సీజ్ చేయించామన్నారు. రూ.300 కోట్ల వరకూ ట్రిబ్యునల్‌లో కేసులు వేశామని, అవి జడ్జిమెంట్‌కు సిద్ధంగా ఉన్నాయన్నారు. వాటిలో 13 కేసుల్లో రూ.70 కోట్ల వరకూ డిక్రీ అయ్యిందని, ఆ ఆస్తులను వేలం వేసి అమ్మేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈలోగా బాధితుల సంఘమని చెప్పుకుంటూ ఇక్కడ అవకతవకలు జరుగుతున్నాయని కమిషనర్‌కు ఫిర్యాదు చేశారని, దానిపై కమిషనర్ విచారణకు ఆదేశించారన్నారు. కలెక్టర్ ద్వారా డీసీఓ విచారణ నిమిత్తం అసిస్టెంట్ కో ఆపరేటివ్ రిజిస్ట్రార్ జీవీ లక్ష్మిని నియమించడంతో ఆమె విచారణ చేసి, రికార్డులను తనిఖీ చేసి, అవకతవకలు లేవని మే నెలలో తేల్చారన్నారు. తమ పాలకవర్గం రాకముందు అడ్‌హాక్ కమిటీ చైర్మన్‌గా పనిచేసిన వీఎస్‌వీ సుబ్బారావు రికార్డులను అప్పగించలేదన్నారు. ఆయనపై ఎస్పీకి ఫిర్యాదు చేశామన్నారు. జయలక్ష్మి సొసైటీ బాధితులకు ఉపశమనం కలిగించేలా ప్రభుత్వం రూ.300 కోట్లు అప్పుగా ఇవ్వాలని తాము కోరామన్నారు. సొసైటీకి దాదాపు రూ.700 కోట్ల ఆస్తులు ఉన్నాయని, బాధితులకు రూ.580 కోట్లు ఇవ్వాల్సి ఉందన్నారు. సమావేశంలో డైరెక్టర్లు చింతా సుబ్బారావు, షేక్ జానీ బాషా, గౌరీ శేఖర్, బాధితులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న చైర్మన్ త్రినాథరావు, చిత్రంలో డైరెక్టర్లు, బాధితులు

బంగారం వ్యాపారిపై దొంగల దాడి



సంఘటనా స్థలాన్ని పరిశీలించి, బాధితుడి నుంచి వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

- ఆభరణాలు, నగదు లాక్కుని పరారీ
- చెందుర్తిలో కలకలం రేపిన ఘటన

పిఠాపురం: బంగారు, వెండి ఆభరణాలు తయారు చేసే వ్యాపారిపై దొంగలు దాడి చేసి, అతడి వద్ద ఉన్న వస్తువులను దోపిడీ చేశారు. చెందుర్తిలో సోమవారం రాత్రి ఈ ఘటన జరిగింది. గొల్లప్రోలు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజమహేంద్రవరంలోని నల్లమందు సందుకు చెందిన సమీర్ ప్రజాపత్ భవాని అనే వ్యక్తి సిల్వర్ ప్యాలెస్ అనే వెండి, బంగారు నగల దుకాణంలో గుమస్తాగా పనిచేస్తున్నాడు. ప్రతి రోజూ ఇతర ప్రాంతాల్లోని వెండి, బంగారు వ్యాపారుల నుంచి వచ్చిన ఆర్డర్ల ప్రకారం వస్తువులు తయారు చేయడం, వాటిని తీసుకెళ్లి వారికి ఇవ్వడం, మళ్లీ వారి నుంచి ఆర్డర్లు తీసుకోవడం, వారిచ్చే నగదుతో పాటు వెండి, బంగారం రావడం ఆయన పని. ఈ నేపథ్యంలో సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు యజమాని చెప్పిన ఆర్డర్ల ప్రకారం వెండి వస్తువులను తీసుకుని పెద్దాపురం, పిఠాపురం, గొల్లప్రోలులోని షాపుల్లో ఇచ్చాడు. అక్కడి నుంచి ముడి వెండిని, వెండి వస్తువులను, బంగారాన్ని తీసుకుని గొల్లప్రోలులో పని ముగించుకుని చెందుర్తిలోని మరో బంగారు షాపు వద్దకు బయలుదేరాడు. మార్గం మధ్యలో జాతీయ రహదారి 216 నుంచి చెందుర్తి వెళ్లే రోడ్డులో పామాయిల్ తోట వద్దకు వచ్చే సరికి, రెండు మోటారు సైకిళ్ల మీద నలుగురు వ్యక్తులు వచ్చి అతడిని అడ్డుకున్నారు. భయభ్రాంతులకు గురిచేసి అతడి వద్ద ఉన్న 12.50 కేజీల వెండి, 51 గ్రాముల బంగారం, రూ.60 వేల నగదును లాక్కొని పరారయ్యారు. దీంతో బాధితుడు గొల్లప్రోలు పోలీసు స్టేషన్‌కు చేరుకుని విషయం తెలిపాడు. పిఠాపురం సీఐ శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్సై ఎస్.రామకృష్ణ, తమ సిబ్బందితో హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఏఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్ పర్యవేక్షణలో కేసు నమోదు చేసి, ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేస్తున్నారు.

దేవుడి పేరుతో ఇసుక దోపిడీ!

కొత్తపేట: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇసుక అక్రమ రవాణాకు అడ్డూ అదుపూ లేకుండా పోయింది. చివరకు దేవుడి పేరును వాడుకుని మరీ అక్రమ దందాకు పాల్పడుతున్నారు. వివరాల్లోకి వెళితే.. ఆత్రేయపురం అధికారిక ఇసుక ర్యాంపు సమీపంలో ప్రజల అవసరాల కోసం స్టాక్ పాయింట్ ఏర్పాటు చేసి ఇసుక నిల్వలు పెట్టారు. ఆ పాయింట్ నుంచి ఆదివారం రాత్రి అక్రమంగా ఇసుక రవాణాను ప్రారంభించారు. దీన్ని గమనించిన స్థానికులు సోమవారం రాత్రి మాటు వేసి ఇసుక రవాణాను అడ్డుకున్నారు. ఎందుకు ఇసుక తరలిస్తున్నారని గ్రామస్తులు నిలదీస్తే, వాడపల్లి వేంకటేశ్వర స్వామివారి క్షేత్రంలో అభివృద్ధి పనులకు తీసుకువెళుతున్నామని అక్రమార్కులు సమాధానం చెప్పారు. ఆలయానికి అయితే అర్ధరాత్రి దొంగతనంగా తరలించడమేమిటి, పగటి పూటే తోలుకోవచ్చు కదా అని ప్రశ్నించడంతో ఇరు వర్గాల మాటామాటా పెరిగి వివాదం తలెత్తింది. ఈ లోపు పోలీసులు రంగప్రవేశం చేసి ఇరువర్గాలను సముదాయించారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న వాహనాలను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించాలని గ్రామస్తులు పట్టుపట్టగా, అది రెవెన్యూ అధికారుల పని అని చెప్పి, వాహనాలను అక్కడి నుంచి పంపించేశారని పలువురు స్థానికులు తెలిపారు. దీనిపై ఎస్సై రామును 'సాక్షి' వివరణ కోరగా అక్కడ గొడవ పడుతున్నారనే సమాచారంతో రెవెన్యూ సిబ్బందితో కలిసి వెళ్లి ఇరువర్గాలను అక్కడి నుంచి పంపిచేశామని తెలిపారు. వాహనాలేమీ సీజ్ చేయలేదని స్పష్టం చేశారు.

బాలికపై వీధి కుక్కల దాడి

కడియం: కడియపుసావరం గ్రామానికి చెందిన ఎనిమిదేళ్ల బాలికపై మంగళవారం మూడు వీధి కుక్కలు దాడి చేశాయి. ఈ ఘటనలో బాలిక కాలికి తీవ్ర గాయాలయ్యాయి. ఆడుకునేందుకు ఇంటి నుంచి బయటకు వచ్చిన బాలికపై కుక్కలు ఒక్కసారిగా దాడి చేశాయి. గమనించి స్థానికులు వాటిని అదిలించడంతో బాలికను వదిలేసి పారిపోయాయి. గాయాలపాలైన బాలికకు కడియం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు.

'మాచవరం' ఘటనపై కదిలిన యంత్రాంగం

- డీఈవో సలీం బాషా విచారణ
- బాలిక తల్లిదండ్రులతో మాట్లాడిన వైనం
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన ట్రైనీ డీఎస్పీ, సీఐ

రాయవరం: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకునేందుకు, అవసరమైన పక్షంలో మూసివేసేందుకు వెనుకాడబోమని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీం బాషా హెచ్చరించారు. మాచవరంలోని మార్గదర్శి పాఠశాలలో బాలికను ఆ స్కూల్ కరస్పాండెంట్ గర్భవతిని చేసిన ఘటనపై మంగళవారం ఆయన విచారణ చేపట్టారు. రాయవరం ఎంఈవో–1 పి.రామలక్ష్మణమూర్తి ద్వారా ప్రాథమిక సమాచారం తెలుసుకున్న ఆయన హుటాహుటిన మాచవరం గ్రామానికి చేరుకున్నారు. ఆ స్కూల్లో ఎటువంటి అనుమతులు లేకుండా 8, 9, 10 తరగతులు నిర్వహిస్తున్నట్లుగా గుర్తించారు. ప్రస్తుతం ఒకటి నుంచి 7వ తరగతి వరకు 49 మంది విద్యార్థులు చదువుతున్నారని పాఠశాల రికార్డుల ద్వారా తెలుసుకున్నారు. పాఠశాలలో కనీస సౌకర్యాలు ముఖ్యంగా మరుగుదొడ్లకు తలుపులు కూడా లేకపోవడంపై డీఈవో ఆగ్రహం వ్యక్తం చేశారు. పూర్తి స్థాయి విచారణ అనంతరం పాఠశాలలో విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చే అంశాన్ని పరిశీలిస్తామన్నారు. అలాగే బాలిక కుటుంబ సభ్యులను కలిసి ధైర్యం చెప్పారు. పూర్తి స్థాయి విచారణ అనంతరం పాఠశాల గుర్తింపును రద్దు చేసే విషయాన్ని కూడా పరిశీలిస్తామన్నారు. విచారణ సందర్భంగా పలువురు తల్లిదండ్రులు ఇటువంటి పాఠశాలలను మూసివేసేందుకు చర్యలు తీసుకోవాలని డీఈవోకు విన్నవించారు. ఆయన వెంట ఎంపీడీవో ఎస్.కీర్తి స్పందన, ఎంఈవోలు పి.రామలక్ష్మణమూర్తి, వై.సూర్యనారాయణ, సమగ్ర శిక్షా జీసీడీవో డాక్టర్ ఎంఏకే భీమారావు, ఏఎల్ఎస్ కో ఆర్డినేటర్ డి.రమేష్ బాబు తదితరులు ఉన్నారు.

ట్రైనీ డీఎస్పీ విచారణ

మాచవరంలో బాలిక ఘటనపై ట్రైనీ డీఎస్పీ ప్రదీప్తి, మండపేట సీఐ పి.దొరరాజుతో కలిసి విచారణ చేపట్టారు. ఆ బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు నేపథ్యంలో పాఠశాలలో నేర స్థలాన్ని పరిశీలించారు. మాచవరంలో ప్రైవేట్ పాఠశాలను కరస్పాండెంట్ ఆకుమర్తి షాజీ జయరాజ్ కొన్నేళ్లుగా నిర్వహిస్తున్నాడు. పాఠశాలలో చదువుకోవడానికి వచ్చిన బాలికను లోబర్చుకుని, ఆమెను భయపెట్టి గర్భవతిని చేసినట్లుగా ప్రాథమిక విచారణలో అధికారులు గుర్తించారు. గతంలో కూడా పాఠశాలలో ఇలాంటి కొన్ని ఘటనలు జరగ్గా, పరువు పోతుందని తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయకుండా మిన్నకుండినట్లు స్థానికుల ద్వారా తెలుస్తోంది. అయితే తమ కూతురికి జరిగిన అన్యాయం మరెవరికీ జరగకూడదనేఉద్దేశంతోబాలిక తండ్రి ఆ పాఠశాల కరస్పాండెంట్ షాజీ జయరాజుపై పోలీసులకు ఫిర్యాదుచేశారు. ప్రస్తుతం నిందితుడు పరారీలో ఉన్నట్లుగా పోలీసులు చెబుతున్నారు. ఇదిలా ఉంటే రాయవరం ఎస్సై డి.సురేష్ బాబు సోమవారం రాత్రి జరిగిన ఘటనపై పోక్సో కేసు నమోదు చేశారు. బాలికను వైద్య పరీక్షల కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.



మాచవరంలోని ప్రైవేటు పాఠశాలలో విచారణ చేస్తున్న డీఈవో సలీం బాషా



తలుపులు లేకుండా అధ్వానంగా ఉన్న పాఠశాలలోని మరుగుదొడ్డి